క్లుప్తంగా

విద్యతోనే ఉన్నత శిఖరాల అధిరోహణ



విజయపురి సౌత్: విద్యార్థులు చక్కగా చదువుకొని ఉన్నత శిఖరాలను చేరుకోవాలని స్థానిక ఏపీఆర్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ నయీం భాను తెలిపారు. కళాశాలలో సోమవారం నిర్వహించిన దీక్షారంభం కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా మాట్లాడారు. విద్యార్థులంతా ఏపీఆర్ డిగ్రీ కళాశాలలో ప్రవేశించడం గొప్ప అవకాశంగా భావించాలని, దాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆకాంక్షించారు. ప్రథమ సంవత్సరం మొదటి మెట్టు అని తెలిపారు. కళాశాల ఇంగ్లిషు లెక్చరర్ మహమ్మద్ బాషా కళాశాలలో చదివి ఉన్నత స్థానాల్లో ఉన్న పూర్వ విద్యార్థుల వివరాలు, వారు కళాశాలకు సహకరించే విధానాన్ని స్ఫూర్తివంతంగా వివరించారు. సీనియర్ విద్యార్థులు జూనియర్లకు ఆత్మీయ సందేశం అందించారు. కార్యక్రమంలో కళాశాల అసిస్టెంట్ ప్రిన్సిపాల్ విజయకుమార్, డెప్యూటీ వార్డెన్ సతీష్, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం ఎన్నిక



పిడుగురాళ్ల: పట్టణంలోని మిలటరీ కాలనీలో సోమవారం ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘ పల్నాడు జిల్లా అధ్యక్షులు కుంభా వీరాంజనేయులు అధ్యక్షతన సమావేశం, నూతన కమిటీ ఎన్నిక నిర్వహించారు. మండల అధ్యక్షులుగా జడ ఆల్‌ఫ్రెడ్, ప్రధాన కార్యదర్శిగా అంగడి అశోక్‌కుమార్, ఆర్థిక కార్యదర్శిగా మూడావత్ దిలీప్‌నాయక్, ఉపాధ్యక్షులుగా తాళ్లూరి శ్రీనివాసరావు, అదనపు కార్యదర్శిగా పేరం సాంబశివరావు, గౌరవ అధ్యక్షులుగా దేవరకొండ నాగేశ్వరరావు, కార్యదర్శిగా చొక్కా ఆనంద్ సాగర్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో జిల్లా ఆర్థిక కార్యదర్శి రమావత్ రక్కునాయక్, రాగిడి కోటేశ్వరరావు, కారసాల విజయ్‌బాబు, పులి ప్రసాద్ పాల్గొన్నారు.

ఎరువులు, పురుగు మందుల దుకాణాల్లో తనిఖీలు



పిడుగురాళ్ల: రైతులకు నాణ్యమైన ఎరువులు, పురుగు మందులను అందజేయాలని ఏవో సంధ్యారాణి, తహసీల్దార్ మధుబాబు తెలిపారు. పట్టణంలోని పలు ఎరువులు, పురుగు మందుల దుకాణాల్లో సోమవారం తనిఖీలు జరిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రసీదు లేకుండా విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎప్పటికప్పుడు అమ్మకాలను స్టాక్ రిజిస్టర్‌లో కచ్చితంగా నమోదు చేయాలని తెలిపారు. రైతులు కూడా కొనే సమయంలో తప్పనిసరిగా రసీదు తీసుకోవాలని వారు సూచించారు. దుకాణదారులు అధిక ధరలకు విక్రయిస్తే వెంటనే తమను సంప్రదించాలని తెలిపారు. తనిఖీల్లో రెవెన్యూ, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాలల్లో సెక్టోరియల్ ఆఫీసర్స్ తనిఖీ



పిడుగురాళ్ల: పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఎంపీపీఎస్(ఎస్టీ, పిడుగురాళ్ల ఏపీటీడబ్ల్యూఆర్ఎస్) బాలుర పాఠశాలను జిల్లా విద్యాశాఖ కార్యాలయ సెక్టోరియల్ ఆఫీసర్స్ సోమవారం తనిఖీ చేశారు. సర్వేపల్లి రాధాకృష్ణ కిట్లు పంపిణీ, పాఠశాలకు రాని విద్యార్థుల గురించి అడిగి తెలుసుకున్నారు. యూడీసీ ప్లేస్‌లో ప్రతి విద్యార్థి పేరు నమోదు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఏఎస్‌వో పద్మారావు, ఏపీవో శంకర్‌రాజు, ఏఎల్ఎస్‌సీ శ్రీనివాసరావు, ఎంఈవో ఎ. శ్రీనివాసరెడ్డి, సీఆర్పీలు పాల్గొన్నారు. ర్పీలు తదితరులు ఉన్నారు.

ఆటో బోల్తా.. భార్యాభర్తలకు గాయాలు

రెంటచింతల: స్థానిక జాతీయ రహదారిలో సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆటో బోల్తా పడి భార్యాభర్తలకు గాయాలైన సంఘటన చోటు చేసుకుంది. రెంటచింతల గ్రామానికి చెందిన భార్యాభర్తలు షేక్ జాన్‌బీ, సైదు కాశీంలు ఆటోలో గడ్డి మూటలు వేసుకుని ఇంటికి తిరిగి వస్తున్న సమయంలో వెనక నుంచి వచ్చిన కారు బలంగా ఢీకొట్టింది. దీంతో ఆటో బోల్తా పడి, ఇద్దరికీ తీవ్రగాయాలయ్యాయి. బాధితులను గురజాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సీహెచ్. నాగార్జున తెలిపారు.

పని చేయని ఫోన్‌లు మాకొద్దు!

- ఫోన్‌లను వెనక్కి ఇచ్చిన అంగన్‌వాడీ కార్యకర్తలు
- 5జీ ట్యాబ్‌లు ఇవ్వాలని డిమాండ్



ఐసీడీఎస్ కార్యాలయంలో వెనక్కి ఇచ్చిన ఫోన్‌లు



ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

పిడుగురాళ్ల: పని చేయని ఫోన్‌లు మాకొద్దు ! అంటూ ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం వద్ద అంగన్‌వాడీ కార్యకర్తలు సోమవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ మండల కార్యదర్శి తెలగపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ 2జీ ఫోన్లతో అంగన్‌వాడీ కార్యకర్తలు గత నాలుగైదు సంవత్సరాలుగా అవస్థలు పడుతున్నారన్నారు. ఫోన్లో రకరకాల యాప్‌లు నింపడానికి సర్వర్ ప్రాబ్లం వల్ల ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. పని చేయని పాత ఫోన్‌లు మార్చి కొత్త వాటిని ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనేక సార్లు ప్రభుత్వానికి విన్నవించుకున్న ప్రభుత్వం పట్టనట్లు వ్యవహరిస్తోందని విమర్శించారు. అన్ని యాప్‌లను కలిపి, ఒకటి రూపొందించాలని, రాజకీయ వేధింపులు ఆపాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వంలో 42 రోజులు సమ్మె సందర్భంగా కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు, సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యుటీని వెంటనే అమలు చేయాలని కోరారు. అనంతరం అంగన్‌వాడీ కార్యకర్తలు నిరసన తెలుపుతూ ఫోన్లను తిరిగి కార్యాలయంలో అందజేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు షేక్ హజ్రా, డి. శాంతమణి, అంగన్‌వాడీ నాయకులు శివరంజని, బుజ్జి, వెంకట రమణ, కవిత, రామలక్ష్మి, వెంకట రమణ, సుజాత, సరస్వతి, పద్మ, అరుణ, జయకుమారి, మంగమ్మ, ఆసియా బేగం పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్ల బిగింపును వ్యతిరేకించండి



స్మార్ట్ మీటర్ల బిగింపును వ్యతిరేకిస్తూ సంతకాల సేకరణ



మాదలలో సచివాలయ సిబ్బందికి వినతిపత్రం అందిస్తున్న సీపీఎం నాయకులు

క్రోసూరు: ప్రజావేదికల ఆధ్వర్యంలో విద్యుత్ స్మార్ట్ మీటర్ల బిగింపుకు వ్యతిరేకంగా, ట్రూ అప్ చార్జీల పేరుతో మోపుతున్న విద్యుత్ భారాలను నిలిపివేయాలంటూ మండల వ్యాప్తంగా సంతకాల సేకరణ కార్యక్రమం సోమవారం చేపట్టారు. ఈ సందర్భంగా క్రోసూరు మండల ప్రజావేదిక ఆధ్వర్యంలో మండలంలోని ఆమంచి భవన్ రోడ్డు ఇతర ప్రాంతాలతో పాటు అంబేడ్కర్ సెంటర్ వద్ద సంతకాల సేకరణ చేపట్టారు. వేదిక కమిటీ సభ్యులు పి.నాగేశ్వరరావు మాట్లాడుతూ గతంలో స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించిన కూటమి ప్రభుత్వం ఇప్పుడు బిగించేందుకు సిద్ధపడటం దుర్మార్గమని అన్నారు. తిమ్మిశెట్టి హనుమంతరావు మాట్లాడుతూ మంగళవారం మండల కేంద్రాల్లో ప్రజావేదికల ఆధ్వర్యంలో నిర్వహించే ధర్నాను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ప్రజావేదిక ప్రతినిధులు రావెళ్ల, పసుపులేటి యదగిరి, వేపూరి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లు బిగించవద్దని వినతిపత్రాలు అందజేత

ముప్పాళ్ల: ఇళ్లకు స్మార్ట్ మీటర్లు బిగించవద్దని, పెంచిన విద్యుత్ చార్జీలను తగ్గించి అదనపు చార్జీలను ఉపసంహరించుకోవాలని కోరుతూ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో గ్రామ సచివాలయాల వద్ద సోమవారం వినతిపత్రాల అందజేశారు. ఆయా గ్రామ సచివాలయాల వద్ద జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న సీపీఎం మండల కార్యదర్శి గుంటుపల్లి బాలకృష్ణ మాట్లాడుతూ స్మార్ట్ మీటర్లు ప్రజల పాలిట ఉరితాళ్లలా మారిపోతున్నాయని, వెంటనే స్మార్ట్ మీటర్లు బిగించడం నిలిపివేయాలన్నారు. ఆయా గ్రామాల్లో సేకరించిన సంతకాలతో కూడిన వినతిపత్రాలను సచివాలయ సిబ్బందికి అందించారు. 5న విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద జరిగే ధర్నా కార్యక్రమంలో అందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో గారాజాలయ్య, పఠాన్ సైదాఖాన్, చింతపల్లి నాగమల్లేశ్వరరావు, కందిమళ్ల సాంబశివరావు, మార్పుల వెంకటరెడ్డి, ఇందూరి సత్యనారాయణరెడ్డి, గొల్లప్రోలు నాగేశ్వరరావు, తోట బ్రహ్మయ్య, వెంకటేశ్వర్లు, కందిమళ్ల శ్రీనివాసరావు, నూకారపు సాంబశివరావు, తొండపి మస్తాన్, మలినేడి నాగేశ్వరరావు, కూరపాటి ప్రభాకర్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి జూడో పోటీలకు కే-రిడ్జి విద్యార్థులు



ఎంపికైన విద్యార్థులతో ప్రిన్సిపల్ బర్నబాస్, కోచ్ శివకృష్ణ

నరసరావుపేట ఈస్ట్: రాష్ట్రస్థాయి బాల బాలికల సబ్‌జూనియర్ జూడో పోటీలకు కే-రిడ్జి పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్టు పాఠశాల ప్రిన్సిపల్ జి.బర్నబాస్ సోమవారం తెలిపారు. ఆంధ్రప్రదేశ్ జూడో అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 3వతేదీ ఆదివారం డీఎస్ఏ స్టేడియంలో నిర్వహించిన జిల్లా జట్టు ఎంపిక పోటీలలో తమ విద్యార్థులు వివిధ విభాగాలలో ఎంపికై నట్టు వివరించారు. బాలుర విభాగంలో ఆనంద్ (45 కేజీలు), హేమహర్షవర్దన్ (50 కేజీలు), తేజరాహుల్ (55 కేజీలు), బాలికల విభాగంలో సీహెచ్.నిరీక్షణ (55 కేజీలు), కె.మోక్షజ్ఞ (57 కేజీలు) ఎంపికైనట్టు తెలిపారు. ఎంపికైన విద్యార్థులు ఈనెల 9, 10 తేదీలలో మంగళగిరి మండలం పెదపరిమిలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీలలో పల్నాడు జిల్లాకు ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు. విద్యార్థులను పాఠశాల చైర్మన్ నాతాని వెంకటేశ్వర్లు, డైరెక్టర్ కోమటినేని నాసరయ్య, ప్రిన్సిపల్ బర్నబాస్, కోచ్ ఓ. శివకృష్ణ అభినందించారు.

మన్నించుమా.. మహావృక్షమా!



ప్రాణాపాయ స్థితిలో ఆక్సిజన్ అందించి జీవితాన్నిచ్చిన వైద్యుడిని దేవుడని పిలుచుకుంటాం. కానీ జీవితాంతం ఉచితంగా ఆక్సిజన్ ఇచ్చే చెట్లను మాత్రం ఖాతరు చేయం. 'పచ్చని చెట్టు ప్రగతికి మెట్టు', 'మొక్క నాటితే క్షేమం – చెట్టు నరికితే క్షామం' అంటూ వేదికల మీద సుదీర్ఘ ఉపన్యాసాలూ ఇస్తాం. ఆచరించి చూపం. ప్రకృతి–అద్దం రెండూ ఒకటే. అద్దం మనం ఎలా ఉంటే అలా చూపిస్తుంది. ప్రకృతిని మనం ఎంత కాపాడితే అది అంత మనల్ని కాపాడుతూ ఉంటుందని పెద్దలు చెబుతారు. కానీ నరసరావుపేటలో ప్రాణాధారమైన వృక్షరాజాలు నెలకొరుగుతున్నాయి. నాగార్జునసాగర్ నిర్మాణం సమయంలో ఏర్పాటైన లింగంగుంట్ల ఎన్నెస్పీ కాలనీలో మొక్కల పెంపకాన్ని చేపట్టారు. ఐదు దశాబ్దాల కాలంలో ఆ చెట్లు మహా వృక్షాలయ్యాయి. ఆ ప్రాంత వాసులకు నీడతో పాటు స్వచ్ఛమైన గాలినీ అందించాయి. నూతనంగా ఏర్పడిన పల్నాడు జిల్లాలో జిల్లా కలెక్టర్, ఎస్పీ కార్యాలయాలను ఈ కాలనీలో ఏర్పాటు చేశారు. దీంతో పాటు ఏరియా వైద్యశాల నూతన భవనాలను నిర్మించారు. దీనికి అనుబంధంగా సీసీయా యూనిట్‌ను నెల్పకొల్పనున్నారు. ఇందుకోసం ఎస్పీ కార్యాలయం పక్కనే ఉన్న స్థలాన్ని కేటాయించారు. ఇప్పటి వరకు ఎస్పీ కార్యాలయ ఆధీనంలో ఉన్న ఈ స్థలాన్ని స్వాధీనం చేసుకొన్నారు. సీసీయా యూనిట్ నిర్మాణాలు ప్రారంభించేందుకు ఆ ప్రాంతంలోని చెట్లను తొలగించేందుకు టెండర్లు పిలిచారు. కాకానికి చెందిన వ్యక్తి టెండరు దక్కించుకొని చెట్ల నరికివేతను ప్రారంభించారు. రావి, వేప, చింత చెట్లను మిషన్‌లను ఉపయోగించి నెలకూల్చారు. భారీ వృక్షాలు నేలకొరగడంతో ఈ ప్రాంతం నేడు బోసిపోయింది.



– నరసరావుపేట రూరల్

తల్లిపాలతో బిడ్డకు పలు ప్రయోజనాలు



పిడుగురాళ్ల: తల్లిపాల వల్ల బిడ్డకు పలు ప్రయోజనాలు ఉన్నాయని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మణి తెలిపారు. తల్లిపాల వారోత్సవాలలో భాగంగా లెనిన్ నగర్‌లోని అంగన్‌వాడీ కార్యాయంలో సోమవారం తల్లులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మణి గర్భిణులు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి తెలియజేశారు. పుట్టిన వెంటనే బిడ్డకు ముర్రుపాలు ఎంతో ఆరోగ్యాన్ని కలగజేస్తామని ఆమె పేర్కొన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు పద్మావతి, శ్రీదేవి, ఎస్ఏ ఆనంద కుమారి, షేక్ ఖుదా జోష్మి, సరళ కుమారి, పలువురు అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు విద్యుత్‌కు అంతరాయం

పిడుగురాళ్ల: పట్టణంలోని మహావీర్ నగర్ సబ్ స్టేషన్‌లో గల 11 కేవీ ఇండస్ట్రియల్ ఫీడర్‌లో లైన్ల మరమ్మతుల దృష్ట్యా విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఏఈ ఎం.సైదారావు తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు లెనిన్ నగర్, మారుతీనగర్, చంద్రపాలెం పరిధిలోని అంతరాయం కలుగుతుందని పేర్కొన్నారు. వినియోగదారులంతా సహకరించాలని ఆయన కోరారు.

భావన రుషీనగర్‌లో ఇంట్లో చోరీ

సత్తెనపల్లి: ఇంట్లో చోరీ జరిగిన ఘటన పట్టణంలోని భావన రుషీనగర్‌లో సోమవారం వెలుగు చూసింది. వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని భావన రుషీనగర్‌కు చెందిన కాకుమాను నాగేశ్వరరావు ఆదివారం సాయంత్రం 6 గంటల సమయంలో పట్టణంలోని బేతేలు చర్చిలో ప్రార్థనకు వెళ్లి తిరిగి రాత్రి 11 గంటలకు వచ్చారు. అప్పటికే ఇంటిలో భద్రపరిచిన రూ.4 లక్షలు గుర్తు తెలియని దుండగులు అపహరించుకుపోయారు. దీనిపై పట్టణ పోలీసులకు నాగేశ్వరరావు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఐఎంఎల్ స్టాక్ నిల్వ కోసం నూతన గోడౌన్ నిర్మించాలి

నరసరావుపేట: ఇండియన్ మేడ్ లిక్కర్ (ఐఎంఎల్) స్టాకు నిల్వ చేసేందుకు ప్రభుత్వమే నూతన గోడౌన్ నిర్మించాలని ఏపీఎస్‌బీసీఎల్ ఐఎంఎల్ హమాలీ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) నాయకులు కోరారు. ఈ మేరకు కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్ సమావేశంలో కలెక్టర్ పి.అరుణ్‌బాబును కలిసి వినతిపత్రం అందజేశారు. గత 40 ఏళ్ల క్రితం నిర్మించి ప్రైవేటు గోడౌన్‌లో ప్రస్తుతం ఐఎంఎల్ డిపో నిర్వహిస్తున్నారన్నారు. దానిలో సుమారు 13 ఏళ్లుగా 92 మంది హమాలీలు పనిచేస్తున్నారన్నారు. గోడౌన్ శిథిలావస్థకు స్టాకు తిరగేయటం చాలా ఇబ్బందికరంగా మారిందన్నారు. దీంతో తామందరమూ కలిసి మరో గోడౌన్‌కు ఏడాదికి రూ.8 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు సొంత డబ్బు ఖర్చు చేస్తున్నామని హమాలీలు పేర్కొన్నారు.

త్రైత సిద్ధాంతం, కృష్ణాష్టమి ఊరేగింపుపై ప్రచారం

సత్తెనపల్లి: ఈ నెల 16న శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా త్రైత సిద్ధాంత ఆదికర్త శ్రీశ్రీశ్రీ ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరుల దివ్య ఆశీస్సులతో 'త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞానవేదిక నరసారావుపేట కమిటీ' ఆధ్వర్యంలో సత్తెనపల్లిలోని గడియార స్తంభం సెంటర్, బస్టాండ్, పోలీస్ స్టేషన్ ఏరియా త్రైత సిద్ధాంత ఆధ్యాత్మిక గ్రంథాల ప్రచారం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా త్రైత సిద్ధాంత ప్రబోధ సేవాసమితి ఇందూ జ్ఞానవేదిక నరసరావుపేట కమిటీ అధ్యక్షుడు ఘడియం పెద్దిరెడ్డి మాట్లాడుతూ దేవుడే ఒక మనిషిగా జన్మిస్తే ఆయనను భగవంతుడు అని అంటామన్నారు. అలాంటి భగవంతుడే శ్రీకృష్ణుడు అని, ఊరిలోని వారందరికీ ఎరుక పరచుటకు ఈ ఊరేగింపు చేయడం జరుగుతుందన్నారు. శ్రీకృష్ణ పరమాత్మ ఊరేగింపు చేసిన గ్రామంలో ప్రకృతి వైపరీత్యాలు, రోగ బాధలు ప్రజలకు ఉండవన్నారు. కార్యక్రమంలో త్రైత సిద్ధాంత ప్రబోధ సేవాసమితి ఇందూ జ్ఞానవేదిక, నరసరావుపేట కమిటీ సభ్యులు ఎలిశెట్టి రమేష్, పగడాల రామయ్య, కోవూరి చిన్న వెంకటేశ్వర్లు, పెరుగు ఏడుకొండలు, తవిటి అమరలింగయ్య, ఎలిశెట్టి రామాంజనేయులు, చల్లగుండ్ల భాస్కరరావు, కాటం పోతురాజు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా ద్వితీయ మహాసభలను జయప్రదం చేయాలి

సీపీఐ ఆధ్వర్యంలో కరపత్రాల పంపిణీ



కరపత్రాలను పంపిణీ చేస్తున్న సీపీఐ నాయకులు

పిడుగురాళ్ల: సీపీఐ పల్నాడు జిల్లా ద్వితీయ మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ పిడుగురాళ్ల ఆర్టీసీ బస్టాండ్‌లో సీపీఐ, ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ నాయకుల ఆధ్వర్యంలో సోమవారం కరపత్రాల ఆవిష్కరణతో పాటు పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ గురజాల నియోజకవర్గ కార్యదర్శి మందపాటి రమణారెడ్డి మాట్లాడుతూ ఏడవ తేదీ సాయంత్రం నాలుగు గంటలకు వినుకొండ పట్టణంలో భారీ ర్యాలీ, బహిరంగ సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి సీపీఐ పల్నాడు జిల్లా కార్యదర్శి కామ్రేడ్ ఏ. మారుతి వరప్రసాద్ అధ్యక్షత వహించగా, ముఖ్య అతిథులుగా రాష్ట్ర కార్యదర్శి కె. రామకృష్ణ, అతిథులుగా సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జంగాల అజయ్‌కుమార్, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు గుజ్జుల ఈశ్వరరావు, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి షేక్ హుస్సేన్‌తోపాటు పలువురు హాజరు కానున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి అక్కినపల్లి బాలయ్య, పార్టీ సీనియర్ నాయకులు ఎస్‌కే కరిముల్లా, ఎంప్లాయీస్ యూనియన్ డిపో కార్యదర్శి బంగారు శ్రీనివాసరావు, జోనల్ పబ్లిసిటీ సెక్రటరీ ఎస్‌కే దస్తగిరితోపాటు ఎస్‌కే బాజీ, డి. వెంకట్రావు, బి. ఎల్లయ్య, ఎస్‌కే జలీల్ పాల్గొన్నారు.

యోగా పోటీల్లో సత్తా చాటిన పిడుగురాళ్ల విద్యార్థులు



యోగాలో గెలుపొందిన విద్యార్థులు

పిడుగురాళ్ల: పల్నాడు యోగాసన భారత్ ఆధ్వర్యంలో జరిగిన యోగా పోటీల్లో పట్టణంలోని తిరుమల ఆక్స్‌ఫర్డ్ విద్యార్థులు ప్రతిభ చాటారు. ఆదివారం నర్సరావుపేటలోని శిశుమందిర్ పాఠశాలలో పోటీలు నిర్వహించారు. ఇందులో తమ విద్యార్థులు ప్రతిభ కనబరిచినట్లు తిరుమల ఆక్స్‌ఫర్డ్ డైరెక్టర్ గిరిబాబు సోమవారం తెలిపారు. అండర్ 10–14 బాలుర విభాగంలో బ్యాక్ మెండ్ పోటీల్లో గోల్డ్ మెడల్, సిల్వర్.. సెయిన్ బెండ్ పోటీల్లో గోల్డ్ మెడల్, సిల్వర్, క్యాంసం పతకాలను సాధించినట్లు చెప్పారు. ఫార్వడ్ బెండింగ్ పోటీల్లో సిల్వర్, క్యాంస పతాకాలు.. అండర్ 14– 18 విభాగాల్లో ఫార్వడ్ బెండింగ్ యోగా పోటీల్లో ప్రథమ స్థానం సాధించినట్లు తెలిపారు. స్పెయిన్ బెండింగ్‌లో బంగారు పతకం, బ్యాక్ బెండింగ్ పోటీల్లో ద్వితీయ స్థానం సాధించారని డైరెక్టర్ గిరిబాబు పేర్కొన్నారు. యోగా మాస్టర్ శివనాయక్ 18–28 విభాగాల్లో ఫస్ట్ ప్లేస్ సాధించినట్లు తెలిపారు. ఇందులో ఏడుగురు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా యోగా మాస్టర్, విద్యార్థులను పాఠశాల ప్రిన్సిపాల్ నరేష్, ఉపాధ్యాయ బృందం అభినందించింది.

రాష్ట్రస్థాయి యోగాసన పోటీలకు ఎంపిక



శ్రీనివాసరాజును అభినందిస్తున్న కోటేశ్వరరావు

నరసరావుపేట రూరల్: రాష్ట్రస్థాయి యోగాసన పోటీలకు నరసరావుపేట ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థి ఎంపికై నట్టు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్లు సోమవారం తెలిపారు. కళాశాలలో సీఎస్ఈ తృతీయ సంవత్సరం చదువుతున్న సి.హెచ్.మారుతీ శ్రీనివాసరాజు నరసరావుపేటలో నిర్వహించిన జిల్లాస్థాయి పోటీలలో ప్రతిభ చాటినట్టు తెలిపారు. సుపెయిన్, అర్టిస్టిక్ పెయిర్ ఈవెంట్ విభాగాలలో ప్రథమ బహుమతిని గెల్చుకొని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికై నట్టు వివరించారు. ఆగస్టు 21వ తేదీ నుంచి 24వ తేదీ వరకు తాడేపల్లిగూడెంలో నిర్వహించే రాష్ట్రస్థాయి యోగాసన పోటీల్లో శ్రీనివాసరాజు జిల్లాకు ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు. ఈ సందర్భంగా కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో కళాశాల చైర్మన్ ఎంవీ కోటేశ్వరరావు, సీఎస్ఈ విభాగాధిపతి డాక్టర్ ఝాన్సీ వజ్రం, వ్యాయామ అధ్యాపకులు ఎల్. కృష్ణారెడ్డి, ఎన్.ఆంజనేయులు, పి.విజకుమార్ అభినందించారు.

క్వారీ మృతులకు రూ.50 లక్షలు ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలి


క్షతగాత్రులను పరామర్శించిన సీఐటీయూ నాయకులు



హాస్పిటల్‌లో బాధితుడిని పరామర్శిస్తున్న ఆంజనేయులు నాయక్

నరసరావుపేట: బాపట్ల జిల్లా బల్లికురవ మండలం కొణిదెన గ్రామ పరిధిలో గల సత్యకృష్ణ క్వారీలో వాటిల్లిన ప్రమాదంలో మృతులకు రూ.50 లక్షలు ఎక్స్‌గ్రేషియా, కుటుంబంలో ఒక్కరికి ప్రభుత్వ ఉద్యోగం, క్షతగాత్రులకు రూ.10 లక్షలు ఆర్థిక సహాయం, కోలుకునే వరకు ఉచిత మెరుగైన వైద్యం అందించాలని సీఐటీయూ పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.ఆంజనేయలు నాయక్ డిమాండ్ చేశారు. పట్టణంలోని జీబీఆర్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను సోమవారం పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితి గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ఇరువురు క్షతగాత్రులకు కాలు తొలగించాల్సిన పరిస్థితి రావొచ్చని వైద్యులు నాయకులకు వివరించారు. ఘటన జరిగిన తీరును క్షతగాత్రులను అడిగి తెలుసుకుని విచారం వ్యక్తం చేశారు. అంజనేయులు నాయక్ మాట్లాడుతూ ఘటనపై న్యాయ విచారణ జరిపించి బాధ్యులను కఠినంగా శిక్షించాలన్నారు. వలస కార్మికుల చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. సత్యకృష్ణ క్వారీలో అనుమతులు లేకుండా తవ్వకాలు జరుగుతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయని దీనిపై సమగ్ర విచారణ జరిపి అధికారులు నిష్పక్షపాతంగా వ్యవహరించి నిందితులను జైలుకు పంపాలన్నారు. మృతులకు రూ.14 లక్షలు, తీవ్రంగా గాయపడిన క్షతగాత్రులకు రూ.10 లక్షలు, స్వల్పంగా గాయపడిన వారికి రూ.1 లక్ష క్వారీ యాజమాన్యం ప్రకటించిందని, సహాయాన్ని ఇంకా పెంచి ఇవ్వాలని, ప్రభుత్వం కూడా త్వరితగతిన స్పందించి పరిహారం ప్రకటించాలన్నారు. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా క్వారీలలో భద్రతా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా కోశాధికారి డి.శివకుమారి, నరసరావుపేట మండల కార్యదర్శి షేక్ సిలార్ మసూద్ పాల్గొన్నారు.

108లో ప్రసవం.. తల్లీబిడ్డ క్షేమం



పెదకూరపాడు (అచ్చంపేట): పురిటి నొప్పులతో తెల్లవారుజామున 3 గంటల సమయంలో బాధపడుతున్న తల్లి వైద్యశాలకు వెళ్తూ 108లోనే ప్రసవించిన సంఘటన అచ్చంపేట మండలం చోటు చేసుకుంది. 108 సిబ్బంది తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని కోనూరు గ్రామానికి చెందిన కొమ్మువరపు శ్రావణికి తెల్లవారుజామున మూడు గంటల సమయంలో పురిటి నొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు 108కి సమాచారం అందించారు. సత్తెనపల్లి కమ్యూనిటీ వైద్యశాలకు 108లో తీసుకువెళుతుండగా మార్గంమధ్యలో రెంటపాల సమీపంలో 4:15 గంటలకు నొప్పులు ఎక్కువవడంతో ప్రసవం జరిగిందని, తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నట్లు తెలిపారు. అనంతరం సత్తెనపల్లి కమ్యూనిటీ హాస్పిటల్‌లో చేర్పించామన్నారు. వైద్యులు పరీక్షించి తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నారని తెలిపారు. 108 సిబ్బందికి, ఈఎంటీ శరత్‌కుమార్‌కు కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.